క్లుప్తంగా

రూ.2.91 లక్షలకు వారసంత వేలం



వేలంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

కెరమెరి: కెరమెరి గ్రామ పంచాయతీకి చెందిన వారసంత వేలం సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో, పంచాయతీ ప్రత్యేకాధికారి అంజద్‌పాషా అధ్యక్షతన నిర్వహించారు. వేలంలో కేవలం నలుగురు పాల్గొనగా రాథోడ్ భూమన్న రూ.2 లక్షల 91 వేలకు దక్కించుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గణేశ్, కారోబారి గడ్డల వెంకన్న తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి పంచాయతీ కార్యాలయంలో సోమవారం వారసంత వేలం నిర్వహించారు. వేలంలో పలువురు పోటీపడగా గ్రామానికి చెందిన టాకిరే హరీశ్ రూ.1,55,200లకు వేలంలో దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి కుకిడే చంద్రశేఖర్ తెలిపారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు.

వేలం వాయిదా

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతీ శనివారం నిర్వహించే వారసంతకు ఏర్పాటు చేసిన వేలం వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి తిరుపతి తెలిపారు. వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. వేలం నిర్వహించే తదుపరి తేదీని తిరిగి ప్రకటిస్తామన్నారు.

నేడు ఏఐ తరగతుల ప్రారంభం

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) లర్నింగ్ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10.30గంటలకు కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రారంభించనున్నట్లు ఎంఈవో రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ఉపాధిహామీ కూలీలు, ప్రజలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సామర్థ్యాల ఆధారంగా విద్యాబోధన చేయాలి



వంటలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రకాశ్

కెరమెరి: సామర్థ్యాల ఆధారంగా విద్యా బోధన చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని సుర్దాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఎండీఎం, ఎఫ్‌ఎల్‌ఎన్ తదితర రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యపుస్తకాలను చదివించారు. ఎఫ్ఎల్ఎన్ ఎండ్ టెస్ట్‌ను నిర్వహించి ఆన్‌లైన్ చేయాలన్నారు. మార్చి31 లోగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వారంలో మూడు సార్లు గుడ్లు వడ్డించాలని పేర్కొన్నారు.

యువకులకు జెర్సీల పంపిణీ



జెర్సీలు పంపిణీ చేస్తున్న ధనుంజయ్

దహెగాం: మండల కేంద్రానికి చెందిన ఎస్సీ వాడ యువకులకు జెర్సీ టీషర్ట్‌లను ఉచితంగా పంపిణీ చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలను వీడి ఉత్తమ మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట చందు, విజయ్, సత్యనారాయణ, రాపర్తి రమేశ్, ప్రదీప్, రోషన్, యువకులు పాల్గొన్నారు.

సంత వేలానికి వేళాయె!



కౌటాల వారసంతలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

- నేడు కౌటాల వారసంతకు వేలం
- ఏటా గ్రామ పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం
- జిల్లాలోనే అతిపెద్ద సంత
- కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బందుల్లో వ్యాపారులు, వినియోగదారులు

కౌటాల: పల్లెలు, మండల కేంద్రాల్లో నిర్వహించే సంతలకు చాలా ప్రాముఖ్యత ఉంది. అన్ని రకాల నిత్యావసరాలు దొరికే సామాన్యుడి మినీ మార్కెట్ వారసంత. పంచాయతీలకు ఆదాయ వనరులుగా నిలుస్తున్న వారసంతల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత యంత్రాంగం విఫలమవుతోంది. చాలాచోట్ల ప్రత్యేక స్థలాలు, షెడ్లు లేక రోడ్లకు ఇరువైపులా తాత్కాలిక డేరాలు వేసుకొని విక్రయదారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేస్తున్నా.. కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. స్థలం లేక రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో సంత జరిగే రోజు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

ఏటా రూ.లక్షల్లో ఆదాయం..

మండల కేంద్రంలో ప్రతీ సోమవారం వారసంత నిర్వహిస్తుంటారు. ఈ సంతలో ప్రజలకు కూరగాయలతో పాటు నిత్యావసర సరుకులు, బట్టలు, స్టీల్ వస్తువులు, ఎద్దుల అలంకరణ సామగ్రి దొరుకుతాయి. ప్రతీ వారం నిర్వహించే సంతలో రూ.లక్షల్లో వ్యాపారం కొనసాగుతోంది. కౌటాల వార సంతకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అతిపెద్ద వారసంతగా పేరుంది. సోమవారం వారసంతతో పాటు పశువుల వారసంత నిర్వహిస్తారు. దీంతో కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి వ్యాపారులు, వినియోగదారులు వేల సంఖ్యలో వస్తుంటారు. కాగా వారసంత స్థలం కబ్జాకు గురవుతుండడంతో సంతరోజు స్థలం సరిపోక వ్యాపారులు కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారికి ఇరువైపులా విక్రయాలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని పశువుల, వారసంతలో ఏటా గ్రామ పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. ఏటా కౌటాల గ్రామ పంచాయతీకి వారసంతతో సుమారు రూ.5 లక్షల పైనే ఆదాయం వస్తుండగా పశువుల సంతకు సుమారు రూ.12 లక్షలపైనే ఆదాయం వస్తోంది. ఈసారి వేలం ధర పెరగొచ్చని అంచనాలు ఉన్నాయి. మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే వారసంతకు అధికారులు ఈనెల 25న వేలం నిర్వహించనున్నారు.

సౌకర్యాలు కరువు..

జిల్లాలోని మండల కేంద్రాల్లో నిర్వహించే వారసంతల నిర్వహణ గడువు మార్చి నెలతో ముగియనుంది. జిల్లాలోని వారసంతలకు అధికారులు వేలం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లోని వారసంతలకు వేలం నిర్వహించారు. ఏటా కౌటాల గ్రామ పంచాయతీకి వార సంతతో రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు వార సంతలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వారసంత స్థలాన్ని రోజురోజుకు అక్రమంగా కబ్జా చేస్తుండడంతో వ్యాపారులకు స్థలం సరిపోవడం లేదు. దీంతో వ్యాపారులు ప్రధాన రోడ్డుకు ఇరువైపుల విక్రయాలు చేస్తున్నారు. కూరగాయల వారసంతలో సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువుల సంత సైతం కనీస సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారసంతల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని వ్యాపారులు, వినియోదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆసక్తి ఉన్నవారు హాజరు కావాలి



మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పశువుల సంత, వారాంతపు సంతల వేలం నిర్వహిస్తాం. వేలంలో వారాంతపు సంతకు రూ. 75 వేలు, పశువుల సంతకు రూ.1.50 లక్షలు డిపాజిట్ చేయాలి. ఆసక్తి గల వారు మంగళవారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో హాజరు కావాలి. – సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి

చిల్లిగవ్వ లేదు.. ఇళ్ల నిర్మాణం ఎలా?



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ వేణుగోపాల్

కెరమెరి: చేతిలో చిల్లిగవ్వ లేదు.. ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలంటే ఎలా అంటూ లబ్ధిదారులు హౌసింగ్ డీఈ వేణుగోపాల్ ఎదుట మొరపెట్టుకున్నారు. సోమవారం మండలంలోని కొఠారి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈ మాట్లాడారు. ఈ నెల 31 వరకు ముగ్గుపోసిన ఇళ్లను ఎట్టి పరిస్థితుల్లో ప్రారంభించాలన్నారు. మార్కింగ్ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ప్రారంభించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని, కుటుంబ పోషణే కష్టమవుతున్న క్రమంలో రూ. లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించాలంటే కష్టంగా ఉందని లబ్ధిదారులు వాపోయారు. గుత్తేదారు ద్వారా ఇళ్ల నిర్మాణం చేపడితే పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను ఎవరికి వారు సొంతంగా నిర్మించాలని, కాంట్రాక్టర్ నిర్మిస్తే నాణ్యత ఉండదని డీఈ పేర్కొన్నారు. బేస్‌మిట్ లెవల్ వరకు నిర్మిస్తే ప్రభుత్వం మొదటి బిల్లు ఇస్తుందని ఆ తర్వాత దశల వారీగా నిర్మాణాన్ని బట్టి బిల్లులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ ఉన్నారు.

'క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం'



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: క్షయ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. జాతీయ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో క్షయ నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స అందించాలన్నారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాలో 2024లో 13,477 మందికి పరీక్షలు నిర్వహించి 989 మందికి, 2025లో 2,863 మందికి పరీక్షలు నిర్వహించి 209 మందికి డిటెక్ట్ చేసి చికిత్స అందించామన్నారు. 2024లో 409 మందికి రూ.8,56,500 చెల్లించినట్లు తెలిపారు. పీహెచ్‌టీబీ డాక్టర్ అజీమొద్దీన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



పశువుల వాహనాన్ని పట్టుకున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: అనుమతి లేకుండా పశువులను అక్రమంగా రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గోలేటి ఎక్స్‌రోడ్ సమీపంలోని సీహెచ్‌పీ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా బొలేరో వాహనంలో తరలిస్తున్న పశువులను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు చేపట్టామన్నారు. కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా ఇతర మండలాల నుంచి పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారి గుండా పశువుల అక్రమ రవాణా జరగకుండా వాహనాల తనిఖీ పకడ్బందీగా చేపడుతున్నామన్నారు.

బాధిత కార్మికుడికి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న అంబాల ఓదెలు

రెబ్బెన: కైరిగూడ ఓసీపీలోని జీఆర్ఎస్ క్యాంపులో పని చేస్తున్న బ్లాస్టింగ్ కార్మికుడు వెంకటేశ్‌కు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు కోరారు. నాలుగు నెలల క్రితం బ్లాస్టింగ్ ట్రక్ ప్రమాదంలో వెంకటేశ్ కన్నుకు గాయం కాగా సరైన న్యాయం జరగకపోవటంతో కుటుంబ సభ్యులతో కలిసి కార్మికులు సోమవారం బంద్ చేపట్టారు. కార్మికుల ఆందోళనకు తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదానికి గురై నాలుగు నెలలు గడుస్తున్నా జీఆర్ఎస్ సంస్థ బాధితుడికి సరైన న్యాయం చేయకపోవడం సరి కాదన్నారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ప్రవీణ్‌కుమార్, బ్లాస్టింగ్ కార్మికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న వారికి సోమవారం బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు తన నివాసంలో 64 మంది కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, నాయకులు ప్రసాద్‌గౌడ్, సత్యనారాయణ, ఎగ్గర్స్ శ్రీకాంత్, కోట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ గుడి నిర్మాణానికి సహకరించాలి



జీఎంను సన్మానిస్తున్న దేవులగూడ గ్రామస్తులు

రెబ్బెన: మండలంలోని దేవులగూడలో లంబాడీల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణానికి బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం తరఫున సహాయ సహకారాలు అందించాలని గ్రామస్తులతో పాటు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ కోరారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లో ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ గోలేటి సీహెచ్‌పీ నిర్మాణంలో దేవులగూడకు చెందిన పలువురు రైతులు తమ భూములను త్యాగం చేసి నిరాశ్రయులయ్యారన్నారు. అయినా సింగరేణి అభివృద్ధికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో భూములను అప్పగించారన్నారు. అలాంటి వారి ఆరాధ్య దైవం సేవాలాల్ గుడి నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం జీఎంను శాలువాతో సన్మానించారు. జీఎం సింగరేణి నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు వినేష్, రమేశ్, రాంకుమార్, అజ్మీర తుకారం నాయక్, సింగరేణి అధికారులు రాజమల్లు, రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌ను నియమించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఎస్టీ బాలికల వసతిగృహంలోడే వాచ్‌మెన్‌ను నియమించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ వాచ్‌మెన్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే వాచ్‌మెన్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు అయ్యుబ్ ఖాన్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక ఇక్కట్లు!

- వార్షిక పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న వైనం
- ఒక్కో విద్యార్థికి రూ.600 వరకు ఖర్చు
- పట్టించుకోని అధికారులు



ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు

దహెగాం: ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులు ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షల నేపథ్యంలో వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారు. కానీ సమయానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. పరీక్షల సమయంలో ఆర్టీసీ అధికారులు అదనంగా బస్సులు నడిపించాల్సింది పోయి ఉన్న బస్సును రద్దు చేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

20 రోజులుగా బస్సు సేవలు బంద్..

కాగజ్‌నగర్ నుంచి దహెగాం మండల కేంద్రం రూట్‌లో సుమారు 20 రోజుల నుంచి ఆర్టీసీ బస్సు సేవలు బంద్ చేశారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై వంతెన అప్రోచ్‌రోడ్డు పనులు పూర్తయ్యే వారం కావస్తోంది. అయినా బస్సు సేవలు నడిపించడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ రూట్‌లో ఇట్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బీబ్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయడానికి మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రానికి వస్తున్నారు. బస్సు లేకపోవడంతో ప్రైవేట్ ఆటోను ఎంగేజ్ చేసుకున్నారు. ఒక్కో విద్యార్థికి సుమారు రూ.600 వరకు చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సైతం ఒక్కో విద్యార్థికి రూ.600 చెల్లించి ఆటోలో పరీక్ష కేంద్రానికి చేరుకుంటున్నారు. ఇట్యాల మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరం ఉంది. చినరాస్పెల్లి 14 కిలోమీటర్ల దూరం ఉంది. మంచిర్యాల డిపో ఆర్టీసీ బస్సు సేవలు ఉన్నా ఉదయం పరీక్ష సమయంలో లేదు. ఉదయం చినరాస్పెల్లి మీదుగా 10 గంటలకు మండల కేంద్రానికి చేరుకుంటుంది. దీంతో విద్యార్థులకు ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అలసత్వం..

పరీక్షల సమయంలో విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు నడిపించాల్సింది పోయి కాగజ్‌నగర్ రూట్‌లో ఉన్న బస్సును రద్దు చేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి ఆర్టీసీ సేవలు లేవంటే మండలంపై అధికారులకు పట్టింపు ఏ మాత్రం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాగజ్‌నగర్ రూట్‌లో ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని మండల వాసులు కోరుతున్నారు.

పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు



మాట్లాడుతున్న హరీశ్‌బాబు

బెజ్జూర్: పోడు భూముల సమస్యపై సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు సోమవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎండాకాలం వచ్చిందంటే ఉమ్మడి జిల్లాలోని పోడు భూముల రైతుల్లో భయాందోళన మొదలవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో గత 50 సంవత్సరాల నుంచి రైతులు పోడు భూములు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అటవీ శాఖ అధికారులు పోడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. పత్తి కట్టె తీసే సమయానికి అధికారులు కందకాలు తవ్వుతున్నారని, దీంతో పోడు రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పదేళ్లుగా ఇబ్బందులకు గురైె గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించితే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ఒరవడిని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల మధ్య జాయింట్ సర్వే నిర్వహించకుండా భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. అటవీ శాఖ అధికారుల అత్యుత్సాహంపై సంబంధిత మంత్రి చొరవ తీసుకోవాలన్నారు. పోలీసులు మర్చిపోయిన థర్డ్ డిగ్రీని ఫారెస్ట్ అధికారులు పోడు రైతులపై ఉపయోగించడం చాలా దారుణమని మండిపడ్డారు. వందలాది టేకు చెట్లను స్మగ్లర్లు నరికి తరలిస్తుంటే కనీసం వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సీనియర్ ఫారెస్ట్ అధికారులు హైదరాబాద్‌లో ఉంటూ ఫీల్డ్‌కు కూడా పోవడం లేదని ఆరోపించారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కర్జెల్లి రేంజ్‌లో 600 టేకు చెట్లు నరికితే డీఎఫ్‌వో, పీసీసీఎఫ్‌లకు ఫిర్యాదు చేస్తే ఒక్కరి మీద కూడా చర్యలు తీసుకోలేదన్నారు. గత 40 సంవత్సరాల క్రితం వేసిన బీటీ రోడ్డుకు ఇప్పుడు రెన్యూవల్ చేద్దామంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

ఆసిఫాబాద్: గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా కేంద్రానికి చెందిన జగదాంబ మెస్‌కు రూ.18 లక్షలు, సిర్పూర్ నియోజకవర్గ ఫొటోగ్రాఫర్లకు రూ.33 లక్షలు, గురుప్రసాద్ ఆటోమొబైల్స్‌కు రూ.17 లక్షలు, ట్రావెల్స్ రూ.5 లక్షలు, హోమ్ కంప్యూటర్స్ రూ.9.5 లక్షలు, సిరిప్లస్‌కు రూ.5 లక్షలు చెల్లించాల్సి ఉందని సదరు నిర్వాహకులు పేర్కొన్నారు. జనవరిలో జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి సైతం వినతిపత్రం అందజేయగా నెలరోజుల్లో నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చి రెండు మాసాలు గడుస్తున్నా ఎలాంటి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో జగదాంబ మెస్, వీ ట్రావెల్స్, ఆసిఫాబాద్ వీడియో గ్రాఫర్స్, కాగజ్‌నగర్ వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.